
సాక్షి

అన్నమయ్య జిల్లా

శనివారం । 3 । మే । 2025



గుర్రంకొండ.. చూసోద్దాం రండి

రాచరికానికి నిలువుటద్దంగా నిలిచిన గుర్రంకొండ కోట వేసవి సెలవుల్లో పిల్లలు, పెద్దలు చూడదగిన ప్రదేశం. జిల్లాకు నడిబొడ్డున ఒక మణిహారంలా విరాజిల్లుతోంది. -10లో



ఎర్రచందనం కేసులో ఇద్దరికి జైలుశిక్ష

ఎర్రచందనం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించినట్లు సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.80	రూ.90
రెండోరకం	రూ.60	రూ.70

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 560 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్ఠం	గరిష్ఠం
సీబీ	615	615
బైవోల్టిన్	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 231.240 కిలోలు

న్యూస్‌రీల్

శుభ్రతతో వ్యాధులు దూరం



నిల్వ ఉన్న నీటిలో లార్వాను పరిశీలిస్తున్న రామచంద్రారెడ్డి

నందలూరు: ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పాటించాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపల్లి నందలూరు హరిజనవాడలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమ గుడ్లను లార్వా దశలోనే నిర్మూలించాలని తెలిపారు. శుభ్రతతో వ్యాధులు దరిచేరవని చెప్పారు. దోమకాటు నుంచి రక్షించుకోవడానికి దోమతెరలను ఉపయోగించాలన్నారు. డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉంటే పంచాయతీ అధికారులకు తెలియజేసి క్లియర్ చేయించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు కార్తీక్, విశ్వనాథ్, సీహెచ్‌ఓ వెంకటనారాయణ, రాజంపేట మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్‌ఎస్‌దాస్, ఆరోగ్య కార్యకర్త అంజమ్మ పాల్గొన్నారు.

ఉత్తమ భవితకు ఆధునిక సాంకేతికత



జ్యోతి వెలిగిస్తున్న ముఖ్య అతిథులు

కురబలకోట: వేగవంతంగా మారుతున్న డిజిటల్ ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ),మెషిన్ లర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక సాంకేతికతపై నైపుణ్యాలను పెంచుకుని విద్యార్థులు ఉత్తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎల్ అండ్‌టీ మైండ్ ట్రీ ప్రోగ్రామ్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ సీనియర్ డైరెక్టర్ ఆశిష్ చద్దా, బెంగళూరు ఐపాలెట్ ప్రిన్సిపల్ డేటా సైంటిస్టు మనోజ్ఞ నాదెళ్ల పేర్కొన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయిలో జరిగిన డిఫెస్టా–25లో ఆశిష్ చద్దా మాట్లాడుతూ ప్రస్తుత టెక్నాలజీ యుగంలో విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానం సరిపోదన్నారు. నూతన టెక్నాలజీలతో అనుసంధానం కావాల్సిన ఆవశ్యకత తప్పనిసరి అని అన్నారు. అప్పుడే విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు బాటలు పడతాయన్నారు. కేరీర్‌కు బలమైన పునాది ఏర్పడుతుందన్నారు. ఉపాధి, ఉద్యోగావకాశాలలో రాణిస్తారన్నారు. క్లౌడ్ కంప్యూటింగ్ అదనపు అర్హతగా నిలుస్తాయని మరో అతిథి మనోజ్ఞ నాదెళ్ల అన్నారు. సైబర్ సెక్యూరిటీ డిజిటల్ ప్రపంచానికి రక్షణ కవచంగా నిలుస్తోందన్నారు. ప్రతి విద్యార్థికి దీనిపై అవగాహన ఉండాలన్నారు.

చెయ్యేరుకు గర్భశోకం



బుడుగుంటపల్లె బ్రిడ్జి వద్ద ఇసుక కోసం బారులు తీరిన టిప్పర్లు (వృత్తంలో)

- మంత్రి అండతో అనుయాయుల అరాచకాలు
- నిత్యం వందలాది టిప్పర్లతో ఇసుక అక్రమ రవాణా
- నదిలో నుంచే హిటాచీల ద్వారా లోడింగ్
- చిత్తూరు, కుప్పం, మదనపల్లె, తమిళనాడు, బెంగళూరుకు తరలింపు
- అడుగంటుతున్న భూగర్భ జలాలతో పల్లెల్లో ఆందోళన

సాక్షి టాస్క్‌ఫోర్స్: అన్నమయ్య జిల్లాలో చెయ్యేరును పచ్చ తోడేళ్లు చెరబట్టాయి!. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అనుయాయులు నిత్యం వందలాది టిప్పర్లతో చెయ్యేరు నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా రాజంపేట నియోజకవర్గం బాలరాజుపల్లె సమీపంలోని బుడుగుంటపల్లె డీసిల్టేషన్ నుంచి ఇసుక తరలిపోతోంది. అన్నమయ్య జిల్లాలో మొత్తం ఆరు రీచ్‌లు ఉన్నాయి. టంగుటూరు, కోమంతరాజుపురం, నారాయణ నెల్లూరుతోపాటు మిగిలిన మూడింటికి బుడుగుంటపల్లె వద్ద డీసిల్టేషన్ పాయింట్లు ఉన్నాయి. బుడుగుంటపల్లె ఇసుక పాయింట్లు రాయచోటికి దగ్గరగా ఉండటంతో మంత్రి పేరు చెప్పి అనుయాయులు యథేచ్ఛగా దోపిడీకి తెర తీస్తున్నారు. ఇక్కడ చెక్‌పోస్టులు నామమాత్రంగా మిగిలాయి.



చెయ్యేరులో హిటాచీ ద్వారా ఇసుకను తోడుతున్న దృశ్యం

అన్నమయ్య నుంచి తమిళనాడు, కర్ణాటకకు

బుడుగుంటపల్లెలోని చెయ్యేరు పాయింట్ నుంచి ఇసుక రాష్ట్ర సరిహద్దు దాటుతోంది. కుప్పం, పుంగనూరు, చిత్తూరులో కెనాల్ పనుల కోసమంటూ నదిలో నుంచే హిటాచీలతో తవ్వేస్తూ ఇసుకను టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇసుక టిప్పర్లు తమిళనాడుకు వెళుతున్నట్లు డ్రైవర్లే చెబుతున్నారు. పెద్ద ఎత్తున ఇసుక దోపిడీ జరుగుతున్నా మైనింగ్‌శాఖ కళ్లు మూసుకుని కూర్చుంది.

ఎటు చూసినా భారీ గుంతలే..

అన్నమయ్య జిల్లాలో రీచ్‌లన్నీ చెయ్యేరు నదిలోనే ఉన్నాయి. ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా తవ్వేస్తుండటంతో నది గర్భశోకంతో విలవిల్లాడుతోంది. చిత్తూరు, కుప్పం, మదనపల్లెతోపాటు చెన్నై, బెంగళూరుకు రాత్రి వేళ టిప్పర్లలో చేరవేస్తున్నారు. నాణ్యమైన చెయ్యేరు ఇసుకకు మంచి డిమాండ్ ఉండటంతో ఎక్కడికక్కడ తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కడ చూసినా చెయ్యేరు భారీ గుంతలతో కనిపిస్తోంది. తాగునీటితోపాటు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బుడుగుంటపల్లె వద్ద చెయ్యేరు నదిలో ఏర్పడిన గుంతలు

ఇసుక దోపిడీపై సమగ్ర విచారణ జరపాలి

రాయచోటి సమీపంలోని ఇసుక క్వారీ నుంచి పెద్ద ఎత్తున ఇసుక దోపిడీ జరుగుతోంది. దీనికి సంబంధించి అనేకమార్లు ఫిర్యాదు చేశాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఇసుక ప్రతిరోజు వందలాది టిప్పర్ల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలి వెళుతోంది. సహజ వనరులైన ఇసుక, మట్టి దోపిడీ చేస్తున్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆలోచించుకోవాలి.

– గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

వెబ్‌ల్యాండ్ రికార్డుల పరిశీలన



రెవెన్యూ వెబ్ ల్యాండ్ రికార్డులను తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి టౌన్: రాయచోటి తహసీల్దార్ కార్యాలయంలో వెబ్‌ల్యాండ్ రికార్డులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ శుక్రవారం పరిశీలించారు. ఏ మండలాల్లో ఎలాంటి రకాల భూములు ఉన్నాయి. అవి ఎవరి ఆధీనంలో ఉన్నాయనే విషయాల గురించి ఆరా తీశారు. ప్రధానంగా వెబ్ ల్యాండ్ రికార్డులపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు చేపట్టారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భూ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు చెందిన తహసీల్దార్లు తమ పరిధిలోని వెబ్ ల్యాండ్స్ రికార్డులను తనిఖీ చేయించుకున్నారు.

1వ తరగతి ఉచిత ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

రాయచోటి జగదాంబసెంటర్: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే మొదటి రోజు జిల్లాలో కేవలం 54 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఈ విషయమై విద్యాశాఖాధికారులు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. అలాగే అన్ని సచివాలయాలు, మండల విద్యాశాఖాధికారుల కార్యాలయాలలో, రిజిస్ట్రేషన్ల కోసం హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి ఫోటోలు షేర్ చేయాలన్నారు.

పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

రాయచోటి అర్బన్: ఉద్యోగులకు తీరని నష్టాన్ని కలిగిస్తున్న సీపీఎస్‌ను వెంటనే రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పథాన్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్.ఆర్.వెంకట జనార్దన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపీఎస్‌ఎస్ రద్దుకోరుతూ శుక్రవారం ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్‌ను వెంటనే రద్దుచేయాలన్నారు. పెండింగ్ డీఏ బకాయిలను చెల్లించాలని, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ కిరణ్, పూర్వపు అధ్యక్షుడు పాలేల రామాంజనేయులు మాట్లాడుతూ ఐదేళ్ల పదవిలో ఉండే రాజకీయనేతలు పెన్షన్ పొందుతున్నప్పుడు 30 ఏళ్లకు పైగా సర్వీసు చేసిన ఉద్యోగులు పెన్షన్‌ను పొందడంలో తప్పేమీ లేదన్నారు. వృద్ధాప్యంలో ఉద్యోగులకు భరోసాగా నిలిచేది పెన్షన్ మాత్రమే అన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పాతపద్ధతిలో పెన్షన్ పొందుతూ ఉద్యోగులకు మాత్రమే సీపీఎస్‌ను అమలుపరచడం దారుణం అని అన్నారు. అనంతరం డీఆర్‌ఓ మధుసూదన్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరమ ణారెడ్డి, ఏపిసిపిఎస్‌ఈఏ యూనియన్ నేతలు శ్రీనివాస్, గురుప్రసాద్‌తో పాటు పెద్దఎత్తున ఉద్యోగులు,నేతలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న ఏపీసీపీఎస్‌ఈఏ నేతలు, ఉద్యోగులు

పోయి రావమ్మా.. గంగమ్మా..

ఘనంగా ముగిసిన జాతర

రైల్వేకోడూరు అర్బన్: భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కోడూరు గంగమ్మ జాతర శుక్రవారం ముగిసింది. పట్టణంలోని పాత బజారువీధిలో గంగమ్మ మిట్టలో వెలసి ఉన్న గంగమ్మను గత రెండు రోజులుగా వేలాది మంది భక్తులు దర్శించుకొన్నారు. ఉదయం 5 గంటల నుంచి గంగమ్మ మిట్టనుండి కొనసాగిన గంగమ్మ శోభాయాత్ర వైభవంగా సాగింది.భక్తులు మొక్కులు తీర్చుకొన్నారు. యువకుల నృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఉంగరాలనగర్‌లోని గంగమ్మ ఘాట్ వద్ద అమ్మవారి నిమజ్జనం జరిగింది. అమ్మవారి మట్టి, పూల కోసం ప్రజలు ఎగబడ్డారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.



నిమజ్జనానికి వెళుతున్న గంగమ్మతల్లి

ఈదురు గాలులకు.. నేలవాలిన పంటలు



వీరబల్లి మండల పరిధిలో గాలివానకు విరిగిపడిన మామిడి చెట్టు



గుర్రంకొండ: మామిళ్లవారిపల్లెలో నేల రాలిన మామిడికాయలు

- 3500 ఎకరాల్లో దెబ్బతిన్న మామిడి
- రూ.50 లక్షల మేర ఆస్తి నష్టం

రాయచోటి: జిల్లాల్లో కురిసిన అకాల వర్షాలకు భారీగా పంట నష్టం వాటిల్లింది. ముఖ్యంగా ఈదురుగాలుల కారణంగా మామిడి రాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అరటి పంటకు కూడా అక్కడక్కడ నష్టం వాటిల్లింది. రాయచోటి, లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ డివిజన్ల పరిధిలో మామిడి పంటకు అధికంగా నష్టం చేకూరినట్లు ఉద్యానవనాధికారుల సమాచారం. జిల్లా వ్యాప్తంగా 3500 ఎకరాల్లో మామిడి పంట దెబ్బతినడంతో సుమారు రూ.50 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు ప్రాథమిక సమాచారం. ఈ ఏడాది మొదట్లో చీడపీడలు వెంటాడాయి. ద్వితీయార్థంలో ప్రకృతి వైపరీత్యాలు మామిడిని పండించే రైతులను నష్టాల పాలు చేశాయి. అష్ట కష్టాలు పడి పండించిన పంట దెబ్బతినడంతో ఏమిచేయాలో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. చెట్లు విరిగిపడడం, కరెంట్ స్తంభాలు కూలడంతో విద్యుత్ శాఖకు నష్టం జరిగింది.



తంబళ్లపల్లె: పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

- రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రాజంపేట, కోడూరు వ్యవసాయ డివిజన్ల పరిధిలో ఇప్పటికే రెండు పర్యాయాలు వీచిన ఈదురుగాలులకు మామిడి, అరటి, బొప్పాయి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. శుక్రవారం రాత్రి వీచిన గాలులకు లక్కిరెడ్డిపల్లి, రామాపురం, వీరబల్లి, సంబేపల్లి, చిన్నమండెం, రాజంపేట, పెనగలూరు, గుర్రంకొండ, ఓబులవారిపల్లె ప్రాంతాల్లో మామిడికి నష్టం వాటిల్లింది. రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో అరటి తోటలను గాలులు దెబ్బతీశాయి. అసలే మామిడి దిగుబడి ఆలస్యంగా రావడం, ఆ పైన ప్రకృతి కన్నెర్ర చేయడంతో చెట్లకున్న కాయల్లో 50 శాతం మేర రాలిపోయాయి. తంబళ్లపల్లెలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పడిపోయింది.

దిగజారిన ధరలు

రారాజుగా పిలుచుకొనే వీరవల్లి బేనీషా, హిమాంపసంద్ వంటి రకాల దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. మార్కెట్లో వీటికి టన్ను లక్ష రూపాయల వరకు పలికింది. ఖాదర్, లాల్ బహర్ ఇతర మేలైన రకాలకు టన్ను రూ.50 నుంచి 70 వేల వరకు పలికింది. ప్రసుతం దిగుబడులు ప్రారంభం కాగా గాలుల కారణంగా ఒక్కసారిగా మార్కెట్ కుప్పకూలి పోయింది. రాలిన మామిడికాయలకు మార్కెట్లో టన్ను రూ.5 వేల నుంచి పదివేల లోపు ధర పలుకుతుండగా, కోసిన కాయలకు రూ.20 నుంచి 50 వేల లోపు మాత్రమే ధరలు పలుకుతుండడం మామిడి రైతులను కుంగిపోయేలా చేస్తోంది.

కూటమి సర్కార్‌లో వ్యవస్థలు నిర్వీర్యం!

- ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన
- చంద్రబాబు సర్కార్‌లో ప్రజాస్వామ్యం కంటే వ్యక్తులకే ప్రాధాన్యత
- తొలిసారి మంత్రి పదవి హోదా దక్కినా నియోజకవర్గ ప్రయోజనం నిల్
- దోపిడీలు, దౌర్జన్యాలు, భూ ఆక్రమణలు, అరాచకాలకే ప్రాధాన్యత
- చితికిపోయినా సామాన్యులు, ఛిన్నాభిన్నమైన వ్యాపార వర్గాలు
- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: అపార అనుభవం అని చెప్పుకుంటూ వ్యవస్థలు నిర్వీర్యం చేశారు. ప్రజా సంక్షేమం లేదు. రైతులకు గిట్టుబాటు ధరల్లేవు. పెట్టుబడి నిధి లేదు. కొత్తగా ఒక్క ఉద్యోగం లేదు. ప్రవేటు సెక్టార్ అభివృద్ధి లేదు. ప్రజలకు చేయూతగా ఉన్న వాలంటీరు వ్యవస్థ లేదు. విద్యా దీవెన, వసతి దీవెన నిలిచిపోయాయి. మహిళలకు చేయూత ఆగిపోయింది. కాపు నేస్తం లేదు. చెప్పినవి ఇవ్వలేదు. ఇచ్చేటివి ఇవ్వలేదు. ప్రజాస్వామ్యం అసలే లేదని కూటమి సర్కార్‌పై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ చీఫ్‌విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ 10 నెలల పాలనపై ఆయన సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మహిళకు రూ.15వేలు బకాయి పడింది. కొత్తగా ఒక్క పెన్షన్ లేదు, రైతులు, మహిళలు, ఉద్యోగులు అన్నీ వర్గాలను చంద్రబాబు సర్కార్ మోసం చేసిందని ఆయన దెప్పిపొడిచారు.

మా పాలన ప్రజాశ్రేయస్సుకే అంకితం...

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలు ప్రజలకు దగ్గరగా వారి శ్రేయస్సుకు అనుగుణంగా ఉండేవి. సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి ప్రజల చెంతకు పాలన తెచ్చారు. రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి, రైతులకు అండగా నిలిచారు. హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రజల బాగోగులు చూశారు. ఆరోగ్యశ్రీ రూ.20 లక్షలకు పెంచి ప్రజల భద్రతగా నిలిచారు. ఆర్థికంగా అండగా నిలిచారు. ఎలాంటి అక్రమాలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా చిత్తశుద్ధితో సంక్షేమం అమలు చేశారు. ఇలాంటివి జనం ఊహించుకోలేదు. ప్రజలకు స్పష్టంగా అర్థం అవుతోంది. అప్పటికి.. ఇప్పటికీ తేడా, వారు కోల్పోయినా సంక్షేమం అన్నీ గమనిస్తున్నారు. అధికారం ఉందని ఇప్పుడు ఎగిరెగిరి పడే వారి కుటుంబాలకు కూడా సంక్షేమం అందేది. పూర్తిగా ప్రజా శ్రేయస్సుకు అంకితమై పాలన కొనసాగిందని శ్రీకాంత్‌రెడ్డి వివరించారు.

ఉపయోగం లేని మంత్రిత్వ హోదా...

రాయచోటి నియోజకవర్గానికి తొలిసారి మంత్రి హోదా లభించినా ఇక్కడి ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ఇంతకాలం జిల్లా కేంద్రానికి నడిబొడ్డున రాయచోటి ఉంది, కాబట్టే జిల్లా ఇచ్చారని చెప్పుకున్నారు. పార్లమెంట్‌కు కూడా సెంటర్ పాయింటే, మరీ ఇవ్వలేదని ఆయన ధ్వజమెత్తారు. 70ఏళ్లుగా పాలనలో ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాలు కూడా పెట్టలేని దుస్థితి ఉండిపోయింది. రాయచోటిని జిల్లా కేంద్రం చేసి ఎన్నో రంగాలల్లో అభివృద్ధి చేశాం. 15 సంవత్సరాల క్రితమే రూ.64కోట్లతో ఫోర్‌లైన్ రింగురోడ్డు ఏర్పాటు చేశాం. రూ.15వేల కోట్లు రియల్ ఎస్టేట్ వ్యాపారం లభించింది. రాయచోటికి సంపద సృష్టించాం. జిల్లా కేంద్రం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేశాం. చుట్టూ 35 కిలోమీటర్లు పరిధిలో ప్రతి వ్యక్తి ఆస్తి 3రెట్లు అధికంగా పెరిగాయి. ఈ పదినెలల కాలంలో రియల్ ఎస్టేట్ కుప్ప కూలింది. సామాన్యులు చితికిపోయారు. వ్యాపార వర్గాలవారు చిన్నాభిన్నమయ్యారు. ఎటుచూసినా ఏరకమైనా అభివృద్ధి కనిపించలేదు. మంత్రి హోదా లభించడం వల్ల నియోజకవర్గానికి ఎలాంటి ప్రయోజనం లభించలేదని మాజీ చీఫ్‌విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

చట్టాలపై నమ్మకం లేకుండా పోతుంది...

మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి ప్రాపర్టీ దొంగతనం చేస్తే ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యల్లేవు. లక్కిరెడ్డిపల్లె జడ్పీటీసీ ఇంటిపై దాడి చేస్తే చర్యల్లేవు. అధికారం అండతోనే ఇవన్నీ చేశారు. చట్టాలు, పోలీసులపై నమ్మకం పోతుంది. మాజీ ఎమ్మెల్యే ఆస్తికే ప్రొటెక్షన్ లేదు. మాండవ్య నదీ లూటీ అవుతోంది. వందల టిప్పర్లు రింగు రోడ్డులో వెళ్తున్నాయి. ట్రాన్సుపోర్టు మంత్రిగా ఉంటూ అక్రమంగా వందలాది టిప్పర్లు మెటీరియల్‌తో నిర్భయంగా పోతుంటే దేనికి సంకేతం. మంత్రి అనుచరులు గ్యాంబ్లింగ్ కొనసాగిస్తున్నారు. కాని స్టేబుల్‌జూదం ఆడిస్తూ పట్టుబడ్డారు. లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. బెల్టషాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. రాజకీయ అండదండలతో అసాంఘిక కార్యక్రమాలు అధికమైయ్యాయని శ్రీకాంత్‌రెడ్డి వాపోయారు.

మంత్రికి కప్పం కట్టాల్సిందే..

రాయచోటిలో ఎన్నడూ లేనివిధంగా కప్పం కట్టాల్సిన రోజులు దాపురించాయి. క్రషర్ యజమానులు మంత్రి కుటుంబసభ్యులకు నెలవారి కప్పం కట్టుతున్నారు. గతంలో ఈసంస్కృతి ఎన్నడూ లేదు. ఇలాంటి పరిస్థితులుంటే ఏకరంగా ఇక్కడికి పరిశ్రమలు వస్తాయి, పారిశ్రామికవేత్తలు వస్తారు. శిబ్యాల వద్ద 500 ఎకరాలు ఏపీఐఐసీ కోసం అప్పట్లో సిద్ధం చేశాం, బహిష్కరించారు. చివరకు ఉపాధి హామీ పనులు కూడా పారదర్శకంగా చేపట్టడం లేదు. ఎన్‌ఆర్జీఈఎస్ కూడా దోపిడీ దాయకంగా సాగుతోంది. చట్టాన్ని నిర్వీర్యం చేయడం, దోపిడీ చేయడం ప్రతి గ్రామంలో ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు.

సహజ వనరులు దోపిడీ....

ఆశ్చర్యకర విషయం ఏమిటంటే ప్రజాస్వామ్య విలువలు దిగజారిపోయాయి. ప్రభుత్వ అధికారులను అడ్డుపెట్టుకొని సహజ వనరుల దోపిడీ చేస్తున్నారు. ఈమాట ప్రతి నోటా వినిపిస్తోంది. రెవెన్యూ, పోలీసుశాఖలను అడ్డుపెట్టుకొని నిబంధనలు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరు కంట కన్పిస్తోంది. భూ ఆక్రమణలు అధికమయ్యాయి. చాలా మంది బాధితులు మాట్లాడుతున్న విషయం చూస్తున్నాం. మాపాలనలో ఐదేళ్ల ప్రభుత్వం ద్వారా సేకరించిన భూమి ప్రజల ఆస్తిగా సృష్టించాం . 100 ఎకరాల్లో కలెక్టరేట్, 11ఎకరాల్లో శిల్పారామం , 25 ఎకరాల్లో స్టేడియం, 45ఎకరాల్లో ఎకోపార్క్, జిల్లా పరిషత్‌కు 11 ఎకరాలు, రెసిడెంట్ బంగళాల కోసం తీర్చిదిద్దాం. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తిగా చేశాం. మా ప్రభుత్వ ఐదేళ్ల మాపాలన అలా ఉంటే, మంత్రి కుటుంబ సభ్యులు, అనుచరులు సహజ వనరులు దోపిడీ చేస్తున్నారు, భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు.

క్లుప్తంగా

రైతుపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం : తనపై దాడి చేశాడంటూ మండలంలోని కందుకూరు వీఆర్వో రమణప్ప ఫిర్యాదు మేరకు రైతుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిహర ప్రసాద్ తెలిపారు. కందుకూరు గ్రామానికి చెందిన రైతు చంద్రమోహన్ తన తండ్రి పేరులో దొర్లిన తప్పులను సవరించాలని వీఆర్వో రమణప్పను కోరారు. తంలో జరిగిన తప్పులను సవరించే అధికారం తనకు లేదని ఈసీ, అర్‌హెచ్ నకలు కావాలని వీఆర్వో కోరారు. దీంతో సహనం కోల్పోయిన రైతు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సచివాలయంలో సిబ్బంది ఎదుట వీఆర్వోపై దాడికి పాల్పడ్డాడు. జరిగిన ఘటనపై వీఆర్వో లిఖిత పూర్వక చేయడంతో రైతుపై కేసు నమోదు చేసామని ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

రామసముద్రం : విద్యుత్ షా క్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... వైఎస్సార్ కడప జిల్లా నందలూరు మండలం పాతూరుకు చెందిన చెన్నయ్య కుమారుడు సుబ్రహ్మణ్యం(36) ఎల్లమ్మ తల్లి ఫొటో పెట్టుకుని తన కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో గ్రామాల్లో పర్యటిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి రామసముద్రం మండలం కమ్మవారిపల్లిలో తన ఆటోలో బ్యాటరీకి 11కేవీ కరెంటు లైన్ నుంచి కనెక్షన్ ఇవ్వబోయారు. ఈ ప్రయత్నంలో ఎలక్ట్రికల్ షాక్ తగిలి మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడు దారుణ హత్య


హత్యకు గురైన యువకుడు సునీల్ కుమార్

మదనపల్లె : మదనపల్లెలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ముఖం తలపై బండరాలతో కొట్టి చంపేసిన సంఘటన శుక్రవారం రాత్రి పట్టణంలో జరిగింది. పట్టణంలోని శేషప్ప తోట మయూరి కళ్యాణమండపం చర్చి వెనుక వైపున, 25 సంవత్సరాల వయసు గల యువకుడు ముఖం, తలపై తీవ్ర గాయాలతో మృతి చెంది పడిఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికులు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు .. మదనపల్లె మండలం బసినికొండ గ్రామానికి చెందిన రఘు కుమారుడు సునీల్ కుమార్ (25) అవివాహితుడు కాగా, భవన నిర్మాణ పనులు ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ కుటుంబానికి అండగా ఉంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పనుల నుంచి సునీల్ కుమార్ ఇంటికి తిరిగి వచ్చాడు. అదే సమయంలో అతని స్నేహితులైన బాలాంజనేయులు, గౌతమ్ ఇంటి వద్దకు వచ్చి పని ఉంది వెళ్దాంరా అంటూ సునీల్ కుమార్ను తమతోపాటు తీసుకువెళ్లారు. అయితే రాత్రి 9 గంటల సమయంలో పట్టణంలోని శేషప్పతోట మయూరి కల్యాణ మండపం చర్చి వెనుక వైపు యువకుడు ముఖం తలపై తీవ్ర గాయాలతో మృతి చెంది పడి ఉండటం, పక్కనే బండ రాళ్లు ఉండటం, గమనించి డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో టూ టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పక్కనే ఉన్న రాళ్లను పరిశీలించి రక్తపు మరకలను గుర్తించారు. హత్య జరిగినట్లు నిర్ధారించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సునీల్ కుమార్ అక్క శశికళ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం తన సోదరుడు దేనిని నిర్ధారించింది. సాయంత్రం అతని స్నేహితులు వెంట తీసుకెళ్లినట్లు పోలీసులకు తెలిపింది. వారిపై అనుమానం వ్యక్తం చేసింది. హత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అనంతరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్రంకొండ.. చూసొద్దాం రండి

- అన్నమయ్య జిల్లాకు మణిహారం గుర్రంకొండ కోట
- వేసవిలో సందర్శించదగిన చరిత్రాత్మక పర్యాటక కేంద్రం


గుర్రంకొండ ముఖచిత్రం

సమ్మర్ స్పెషల్

గుర్రంకొండ : జిల్లాలో రాచరికానికి, నవాబులు, రాజులు, బ్రిటీష్ వారి పాలనకు నిలువుటద్దంగా నిలిచిన గుర్రంకొండ కోట వేసవి సెలవుల్లో పిల్లలు, పెద్దలు చూడదగిన ప్రదేశం. జిల్లాకు నడిబొడ్డున ఒక మణిహారంలా విరాజిల్లుతోంది. 14వ శతాబ్దం నుంచి ఈ కోటను పలు వంశాలకు చెందిన రాజులు, నవాబులు పరిపాలించారు. కడప నవాబు పరిపాలనలో ఈ కోట పేరుగాంచింది. శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి దేవాలయాలు, చెరువులు ఉన్నాయి. మైసూర్ రాజు టిప్పుసుల్తాన్ బాల్యం, విద్యాభ్యాసం ఇక్కడే గడిచింది. చివరగా బ్రిటీషువారితో ఇక్కడ రాజరిక పాలనకు తెర పడింది. ఈ ఘనచరిత్ర కలిగిన ఈ కోటలోఎన్నో విశేషాలు, చూడదగిన ప్రదేశాలు, ఆకట్టుకొనే కట్టడాలు ఉన్నాయి. వేసవి సెలవుల్లో ఈ విశేషాలను తిలకించడానికి రాష్ట్రం నుంచే గాక కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు. మనం కూడా ఒకసారి చూసొద్దాం రండి.

రంగినీ మహల్

గుర్రంకొంట కోటలో చూడదగిన ముఖ్య ప్రదేశం రంగినీమహల్. ఎంతో పురాతన రాజభవనం ఇది. ముందువైపు నుంచి రెండు అంతస్తులుగా, వెనక వైపు నుంచి మూడు అంతస్తులుగా కనిపించడం దీని ప్రత్యేకత. ఎన్నో గదులు, ఓ గదిలో భవనం లోపలి నుంచి సొరంగ మార్గం ఉంది. శత్రు రాజులు దండెత్తినప్పుడు ఈ మార్గంలో కోట బయటకు వెళ్లేందుకు ఈసొరంగం ఒక మార్గంగా ఉండేది. పురాతన మెట్లు, సమావేశపు గదులు రాజరికానికి నిలువుటద్దంగా నిలుస్తాయి.

కోటముఖద్వారం

గుర్రంకొండను రాజులు పరిపాలించే కాలంలో కొండ చుట్టూ కోట గోడ నిర్మించారు. చుట్టూ కందకాలు తవ్వి వాటిలో నీరు నింపేవారు శత్రువులు కోటగోడలు ఎక్కకుండా ఆనీటిలో మొసళ్లు వదిలేవారు. అలాంటి కోటకు ముఖద్వారాన్ని నిర్మించారు. ఈ ద్వారం నుంచే ఎవరైనా కోటలోకి ప్రవేశించేవారు. పురాతన కట్టడంగా ఇది నిలుస్తోంది.

షాకమాల్ దర్గా

కోట పక్కనే మగ్బ్రీరా ఉంది. పురాతన మహమ్మదీయుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కట్టడం ఇది. మగ్బ్రీరా అంటే సమాధి. గుర్రంకొండ కోటను టిప్పుసుల్తాన్ మేనమామ మీర్‌రజాఅలీఖాన్ పాలించేవారు. అతను మృతిచెందిన తరువాత సమాధిని మగ్బ్రీరాగా నిర్మించారు. డూమ్‌లో చేసే శబ్దాలు ప్రతిధ్వనించడం ప్రత్యేకత.

కోటలో ఇంకా చూడదగిన విశేషాలు

- కొండపైన కోట బురుజులు, పురాతన కట్టడాలు, పురాతన ఇళ్లు ఉన్నాయి. అక్కడికి చేరుకోవడానికి మెట్లమార్గం కూడా ఉంది.
- కోటలో శిథిలావస్థకు చేరుకొన్న అలనాటి ఆస్పత్రి భవనం ఉంది.
- కోటలో ఆంజనేయస్వామి, విఘ్నేశ్వరస్వామి ఆలయాలు, టిప్పుసుల్తాన్ కాలంనాటి ఈద్గాలు ఉన్నాయి.
- గుర్రంకొండ పట్టణంలో షాకమాల్ దర్గా దర్గా దగ్గర టిప్పుసుల్తాన్ చదువుకొన్న పాఠశాల యూసూఫ్ సాహెబ్ తకియా ఉంది.
- కోట నుంచి పదికిలోమీటర్ల దూరంలో తరిగొండ గ్రామంలో ప్రముఖ రచయిత్రి తరిగొండ వెంగమాంబ ఆలయం ఉంది.
- గుర్రంకొండ పాలకులు టిప్పు సుల్తాన్ చదవుకొన్న యూసూఫ్ సాహెబ్ తకియా(తకియా అంటే పారసీ భాషలో పాఠశాల అని అర్థం). ఇక్కడ ఉంది.
- గుర్రంకొండ కోటలో లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని శ్రీకృష్ణ దేవరాయులు కొండపైభాగంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. రంగినీ మహల్‌కు దగ్గరలో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయానికి ప్రత్యేకత ఉంది.
- కోట నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో సంతాన ప్రదాయిని చెర్లోపల్లె శ్రీ రెడ్డెమ్మకొండ దేవాలయం ఉంది.
- వీటితోపాటు ఇంకా ఎన్నో విశేషాలు గుర్రంకొండ కోటలో చూడవచ్చు.

ఇలా వెళ్లొచ్చు..

- జిల్లా కేంద్రం రాయచోటి నుంచి మదనపల్లెకు వెళ్లే మార్గంలో 38 కిలోమీటర్ల దూరంలో కడప–బెంగుళూరు జాతీయ రహదారిపై ఉంది.
- తిరుపతి నుంచి మదనపల్లెకు వెళ్లే మార్గంలోని వాల్మీకీపురం నుంచి 17 కిలోమీటర్లు ఉంటుది. . ఇదే మార్గంలోనే తరిగొండ వెంగమాంబ ఆలయమున్న తరిగొండ గ్రామం ఉంది.
- తిరుపతి నుంచి నేరుగా అయితే 110 కిలోమీటర్ల దూరం ఉంటుంది. చిత్తూరు నుంచి నేరుగా అయితే 125 కిలోమీటర్ల దూరం ఉంటుంది.
- మదనపల్లె నుంచి కడపకు వెళ్లే మార్గంలో అయితే మదనపల్లె నుంచి 33 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


టిప్పర్ ఢీకొని నుజ్జునుజ్జయిన ఆటో, పక్కడే అనిత మృతదేహం

రాజంపేట : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందారు. చిట్వేలి మండలం నాగవరానికి చెందిన మూరి అనిత(28) పెద్దఓరంపాడులోని తన పుట్టింటి నుంచి రాజంపేటకు ఆటోలో బయలుదేరారు. కడప–రేణిగుంట జాతీయ రహదారిపై రాజంపేట పట్టణ శివారులోని అశోక్ గార్డెన్స్ వద్ద వీరి ఆటోను టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మూరి అనిత(28) అక్కడికక్కడే మృతిచెందారు. ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లెకు చెందిన ఆటో డ్రైవర్ అంజి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం అతడిని కడప రిమ్స్ తరలించారు. విషయం తెలుసుకున్న బంధువులు చేరుకు బోరున విలపించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతికి వెళ్తూ యానిమేటర్‌కు గాయాలు


బస్సు ప్రమాదంలో గాయపడిన కవిత

ఓబులవారిపల్లె : అమరావతి పునర్నిర్మాణ సభకు వెళ్తూ ఒంగోలు వద్ద బస్సు టైర్ పగిలి జరిగిన ప్రమాదంలో యానిమేటర్ పత్ర కవితకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. అమరావతిలో మోదీ సభకు గురువారం రాత్రి మండలంలోని ఎస్‌హెచ్‌జీ బృందాల మహిళలు ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. ఒంగోలు చేరగానే.. బస్సు వెనుక టైర్ పెద్ద శబ్దంతో పేలింది. ఓబులవారిపల్లె మండలం శంకరాపురం దళితవాడకు చెందిన పత్ర కవిత, మంగళంపల్లె గ్రామానికి చెందిన గీతకు గాయాలయ్యాయి. వారిని తిరుపతి బర్డ్ ఆసుపత్రికి తరలించారు. సభకు వెళ్తూ పత్ర కవిత గాయపడినా నాయకులు పట్టించుకోలేదని రైల్వేకోడూరు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జోతి చిన్నయ్య విమర్శించారు.

సచివాలయ ఉద్యోగిపై కత్తితో దాడి

తంబళ్లపల్లె : స్నేహితుల మధ్య కలహాలతో ఓ గ్రామ సచివాలయ ఉద్యోగిపై కత్తితో దాడిచేసి గాయపరచిన సంఘటన గురువారం సాయంత్రం మండల కేంద్రంలో జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలు..ఎర్రసానిపల్లె పంచాయతీ ఎర్రమద్దువారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు గణేష్(28) చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం పుదిపట్ల సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడికి కురబలకోట మండలం మట్లివారిపల్లెకు చెందిన ప్రవీణ్‌కుమార్ స్నేహితుడు. కొద్దిరోజుల క్రితం ప్రవీణ్ కుమార్‌ను తంబళ్లపల్లె మండలం చేలూరువాండ్లపల్లెకు చెందిన మున్వర్ స్థానిక బస్టాండ్‌లో బహిరంగంగా దూషించాడు. ఈ విషయమై గణేష్, మున్వర్‌ను అతడు నా స్నేహితుడు.. ఎందుకు దూషించావని ప్రశ్నించాడు. దీనిపై ఆగ్రహించి అతడికి నీవు సపోర్ట్ ఏంట్రా... నీ అంతు చూస్తానని బెదిరించాడు. ఈ క్రమంలో గణేష్, గురువారం సాయంత్రం స్నేహితులతో కలిసి హరిత సర్కిల్‌లోని చికెన్ పకోడా సెంటర్ వద్ద ఉండగా మున్వర్, అతడి అన్న మహమ్మద్, శశిలు ద్విచక్ర వాహనంలో వచ్చి గణేష్‌పై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశారు. తలకు, ఎడమచేతి వేళ్లకు, కాళ్లకు రక్తగాయాలు కావడంతో చుట్టుపక్కల జనం అరవగా.. ముగ్గురు ద్విచక్రవాహనంలో పారిపోయారు. గాయపడిన గణేష్‌ను, స్నేహితులు సీహెచ్‌సీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమచికిత్సలు చేసి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఫిర్యాదుమేరకు దాడిచేసిన ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు.

చేపల కోసం విషప్రయోగం

కలెక్టర్‌కు రెండు గ్రామాల ప్రజల ఫిర్యాదు


మృతి చెందిన చేపలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రంగసముద్రం చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విషపూరితమైన ద్రావణాన్ని కలిపేశారని మండలంలోని రంగసముద్రం, రాపూరివాండ్లపల్లి పంచాయతీ ప్రజలు కలెక్టర్, మత్స్య శాఖ, డీపీవో, డీఎల్‌పీవో, మండల అధికారులకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఫిర్యాదు చేశారు. విష ప్రయోగంతో చెరువులోని చేపలు మృతిచెందాయని వారు పేర్కొన్నారు. చేపలు నీటిలో తేలియాడడం, రంతా కలుషితమై దుర్వాసన రావడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మృతిచెందిన చేపలు తిన్న కుక్కలు రోగాల బారిన పడుతున్నాయని, కలుషిత నీటిని తాగి పశువులు, ప్రజలకు ప్రాణ నష్టం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని అధికారులకు వారు తమ గోడును వెళ్ళబోసుకున్నట్లు తెలిపారు. నీటిని కలుషితం చేసిన వారిని గుర్తించి, చూసీ చూడనట్లు వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

చెట్టుకు ఉరివేసుకొని తిరుపతి వాసి మృతి

రాయచోటి : రాయచోటి రూరల్ మండలం జంగంరెడ్డిగారిపల్లె సమీపంలో చింత చెట్టుకు ఉరివేసుకుని కోటకొండ రెడ్డప్ప(40) మృతి చెందినట్లు రాయచోటి అర్బన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి టౌన్ ఎన్టీఆర్ కాలనీలో నివాసముంటున్న రెడ్డప్ప జంగమరెడ్డిగారిపల్లెలోని కుమార్తె డేరంగుల మాధవి ఇంటికి ఐదు రోజుల కిందట వచ్చారు. మద్యం తాగడం మానుకోవాలంటూ కుమార్తె మాధవి చెప్పింది. మద్యానికి బానిసైన రెడ్డప్ప మద్యం తాగకుండా ఉండలేక గురువారం రాత్రి అందరూ పడుకున్న తర్వాత ఇంటి నుంచి వెళ్లి మామిడితోటలోని చింత చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందారు. రెడ్డప్ప కుమార్తె డేరంగుల మాధవి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో భవన నిర్మాణ కార్మికుడు మృతి


చెరువులో తేలియాడుతున్న జగన్నాథం మృతదేహం

నిమ్మనపల్లె : చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందిన ఘటన నిమ్మనపల్లె మండలంలో శుక్రవారం వెలుగు చూసింది. రాచవేటివారిపల్లెకు చెందిన బోడుమల్లె జగన్నాథం (40) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నారు. అతడికి భార్య చిన్నబుజ్జి, కుమార్తె మహిత, కుమారుడు మహేష్ ఉన్నారు. ఏప్రిల్ 30న భార్య కూలి పనికి వెళ్లగా, మదనపల్లె ఆస్పత్రిలో బంధువు అనారోగ్యంతో ఉన్నాడని, చూసి వస్తానని జగన్నాథం ఇంటి నుంచి వెళ్లాడు. అయితే.. మూడు రోజులుగా రాకపోవడంతో భార్య కుటుంబ సభ్యులతో కలిసి భర్త కోసం గాలిస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ఆచార్లపల్లె సమీపంలోని ముసలినాయుని చెరువులో ఓ వ్యక్తి మృతదేహం తేలియాడుతుండడం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు...స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తెచ్చారు. మృతుడి కుడిచేయికి మల్లయ్య పచ్చబొట్టు, ఎర్రటి గుడ్డ ఉండగా, కుడికాలికి ఎర్రటితాడు ఉంది. దీంతో పోలీసులు, గత మూడురోజులుగా కనిపించని వారి కుటుంబసభ్యులు ఉంటే రావాల్సిందిగా సమాచారం అందించడంతో మృతుడి భార్య చిన్నబుజ్జి చెరువు వద్దకు చేరుకుని ఆనవాళ్ల ఆధారంగా భర్త జగన్నాథంను గుర్తు పట్టింది. మృతి చెందిన వ్యక్తి తన భర్తేనని చెప్పింది. తన భర్త అప్పుడప్పుడు చేపల కోసం చెరువుకు వెళుతుంటాడని, అదే క్రమంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతి చెంది ఉంటాడని పోలీసులకు వివరించింది. దీంతో పోలీసులు మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. భార్య చిన్నబుజ్జి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన శిరీష

ములకలచెరువు/మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం ములకలచెరువు మండలంలో జరిగింది. చిన్నమొరవపల్లెకు చెందిన అమరనాథ్‌రెడ్డికి, శిరీష(26)తో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేరు. శిరీష మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేసేది. ఇటీవల కొంతకాలంగా తరచూ కుటుంబంలో గొడవలు జరుగుతుండటంతో ఉద్యోగం మానేసింది. ఈ క్రమంలో శుక్రవారం మరోసారి కుటుంబ సమస్యలతో భర్తతో గొడవపడింది. మనస్తాపం చెంది ఇంట్లోనే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఔట్‌పోస్ట్ పోలీసులు వివాహిత మృతి సమాచారాన్ని ములకలచెరువు పోలీసులకు తెలియజేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ములకలచెరువు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఎర్రచందనం కేసులో ఇద్దరికి జైలుశిక్ష


నిందితులతో అటవీ శాఖ సిబ్బంది

సిద్దవటం : ఎర్రచందనం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ అర్‌ఎస్ఎస్ అడిషనల్ సెషన్స్ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించినట్లు సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సిద్దవటం రేంజ్‌లో ఎర్రచందనం తరలింపుపై సిద్దవటం మండలం మాధవరం గ్రామానికి చెందిన రామేటి సుబ్బరాజు, కడప మలినేనిపట్నానికి చెందిన గంపాల యల్లయ్యలపై కేసు నమోదైందన్నారు. ముత్తుకూరు బీట్‌లో రూ.47 కిలోల ఎర్రచందనాన్ని అక్రమంగా తరలించేందుకు యత్నించినట్లు విచారణలో తేలిందన్నారు. దీంతో నిందితులకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించిందన్నారు.

రైతు ఇంట్లో బంగారు నగల చోరీ

కురబలకోటలో వరుస చోరీలతో కలకలం


గౌనివారిపల్లెలో బీరువా పగుల గొట్టిన దొంగలు

కురబలకోట : మండలంలో మళ్లీ బంగారు నగలు చోరీ అయ్యాయి. అంగళ్లు దగ్గరున్న గౌనివారిపల్లెలోని జి.సోమశేఖర్‌రెడ్డి ఇంటిలో శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని యువకులు ప్రవేశించి బీరువాలో దాచిన రూ.25 లక్షల విలువ చేసే 250 గ్రాముల బంగారు నగలను అపహరించారు. పోలీసులకు బాధితుడు తెలిపిన వివరాల మేరకు..గౌనివారిపల్లెకు చెందిన సోమశేఖర్ రెడ్డి శుక్రవారం కుటుంబంతో సహా ఊరికి దగ్గరలోని టమాటా పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి రాగా తలుపు తెరచి ఉండడం కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలు తెరచి ఉండడం.. మంచంపై చెల్లా చెదురుగా దుస్తులు పడిఉండడం గమనించి అవాక్కయ్యారు. బీరువాలో రూ.25 లక్షలు విలువ చేసే 250 గ్రాముల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకుపైన పంచె కట్టుతో ఉన్న ఇద్దరు యువకులు ఊరిలో సంచరించినట్లు స్థానికులు చెబుతున్నారు. తెలిసిన వారింటికి చుట్టాలుగా వచ్చి ఉంటారని తొలుత భావించడంతో పసిగట్టలేకపోయారు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ గ్రామంలో విచారణ జరిపారు. వేలిముద్రలు, ఆధారాల సేకరణతో పాటు విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. యువకుల వస్త్రధారణను బట్టి ఇళ్లల్లో చోరీ చేయడంలో దిట్టగా ఉన్న తమిళనాడు గ్యాంగ్‌గా ఉన్నట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు. పోలీసులకు సవాల్ చేసేలా జరుగుతున్న ఈ దొంగతనాలు స్థానికులను కలవరపరుస్తున్నాయి.

అక్కడ ప్రెస్ మీట్...ఇక్కడ మళ్లీ చోరీ.!!

మండలంలో వరుస చోరీలు జరుగుతుండడంతో జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు ముందు ఇదే గౌనివారిపల్లెలో హైవే పక్కనే ఉన్న ఇంటిలో బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత అంగళ్లులో హైవే పక్కన ఏడు షాపుల్లో చొరబడి సామాగ్రి, నగదు ఎత్తుకెళ్లారు. చేనేతనగర్‌లోని హార్డ్‌వేర్ షాపులో చొరబడి వస్తువులు పట్టుకెళ్లారు. ఇటీవల కురబలకోటలోని కువైట్ మస్తాన్, అదే ఊరికి చెందిన వరలక్ష్మి ఇంటిలో రెండిళ్లలో కేజీ దాకా బంగారు నగలు, నగదు చోరీకి గురయ్యాయి. ఈ కేసులో నిందితులను అరెస్టు చేసి మదనపల్లె డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ప్రెస్‌మీట్ నిర్వహిస్తుండగా అదే సమయంలో మండలంలోని గౌనివారిపల్లెలో మళ్లీ కొత్తగా చోరీ జరగడం ఆందోళన కలిగిస్తోంది. రాకపోకలు సాగించేవారిని పసిగట్టడానికి ప్రతి ఊరికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడుతోంది. బ్యాంకుల్లో భద్రపరచుకోవడం అదీ లేదంటే గోల్డ్ లోను కింద బంగారు నగలను భద్రపరచుకోవడం ఉత్తమమని పలువురు భావిస్తున్నారు. ముందు జాగ్రత్తతో విలువైన వాటిని కాపాడుకోవడం ఉత్తమమని పోలీసులు చెబుతున్నారు.

రమణీయం.. రథోత్సవం

- వైభవంగా పుష్పగిరి బ్రహ్మోత్సవాలు
- హరిహరులకు ప్రత్యేక పూజలు
- భారీగా పాల్గొన్న భక్తజనం


శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవంలో రథాన్ని లాగుతున్న భక్తులు (ఇన్‌సెట్) రథంపై శ్రీదేవి, భూదేవితో కొలువు దీరిన చెన్నకేశవుడు

వల్లూరు: పుష్పగిరిలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం హరిహరుల రథోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. పుష్పగిరి భక్తజన సంద్రంగా మారింది. ఉదయం శ్రీ వైద్యనాథేశ్వరస్వామి రథోత్సవం జరిగింది. శ్రీ కామాక్షీ సమేతుడైన వైద్యనాథస్వామి రథంలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం శివ నామాన్ని స్మరిస్తూ భక్తులు పోటీ పడి రథాన్ని లాగారు. కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

- సాయంత్రం శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం జరిగింది. బ్రహ్మోత్సవాల ప్రారంభం నుంచి గ్రామోత్సవాలలో వివిధ వాహనాలపై ఒంటరిగా దర్శనమిచ్చిన చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవంతో పరిపూర్ణుడై శ్రీదేవి, భూదేవిలతో కలిసి రథంపై ఆశీనులయ్యారు. బంగారు ఆభరణాలతో అలంకార భూషితులైన స్వామివారు ఇద్దరు దేవేరులతో కలిసి దర్శనమివ్వడంతో.. సాక్షాత్తు వైకుంఠంలోని శ్రీహరి అంశకు చెందిన శ్రీ వెంకటేశ్వరున్ని దర్శించుకున్నట్లుగా భక్తులు పులకించి పోయారు. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో రథం వద్ద పూజలు చేశారు. అనంతరం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రథ సంప్రోక్షణ, అభిషేకాలు నిర్వహించారు. రథ ప్రారంభ పూజ, వాస్తు పూజ, శాంతి, అష్టబలి, కుష్మాండబలి, ఉత్సవ మూర్తుల దేవతా రాధన, మహా మంగళ హారతి నిర్వహించారు. గోవింద నామాలను జపిస్తూ భక్తులు రథం గొలుసులను పట్టుకుని లాగారు. పుష్పగిరి మాడ వీధుల్లో భక్తులు కాయ కర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.
- రథాల వద్ద జరిగిన పూజల్లో పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యాశంకర భారతి, ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పుష్పగిరిలో నేడు

పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి శ్రీ కామాక్షీ వైద్యనాథస్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి అశ్వవాహనంపై దర్శనమివ్వనున్నారు.